క్లుప్తంగా

ఈద్గా వద్ద రంజాన్‌కు ఏర్పాట్లు



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ఈద్గా వద్ద రంజాన్ సందర్భంగా ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసేందుకు వీలుగా మున్సిపల్ అధికారులు గురువారం ఏర్పాట్లు చేపట్టారు. ఈద్గా ఆవరణను మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, టీపీవో వినయ్, ఇతర అధికారులు పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా రంజాన్ రోజున తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీశ్‌కుమార్

ముత్తారం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మంథని డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఓడెడ్‌లో గురువారం ఆయన ఆకస్మిక పరిశీలన చేశారు. గ్రామంలోని వార్డుల్లో తాగి పడేసిన మద్యం సీసాలు, చెత్తచెదారాన్ని పరిశీలించారు. అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలో నిత్యం పారిశుధ్యంపై దృష్టిసారించాలని కార్యదర్శిని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

నిట్టూరులో పోచమ్మ కొలుపు



పోచమ్మ కొలుపులో గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: 'పోచమ్మతల్లీ.. మా పిల్లాపాపలను సల్లంగ సూడమ్మా' అంటూ పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామస్తులు గ్రామదేవతలకు గురువారం మొక్కులు చెల్లించారు. పంచాయతీ ఆఫీసు వద్ద ఉన్న గ్రామదేవతల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా లక్ష్మీదేవర పట్నాలు



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటలో ముదిరాజ్ కులస్తులు గురువారం లక్ష్మీదేవర పట్నాలు, బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బోస్ ఫెలోషిప్ సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: వారంలో రెండు రోజులు (ప్రతి శని, ఆదివారాల్లో) తమ స్వగ్రామాల్లోని ప్రైమరీ విద్యార్థులకు బేసిక్ నేర్పించిన విద్యార్థినులు రమాదేవి, భావనకు గురువారం డీఈవో మాధవి బోస్ ఫెలోషిప్ సర్టిఫికెట్లను అందజేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

పెండింగ్ ఉపకార వేతనాలు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు రంజిత్, కిరణ్ ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో గురువారం జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషలిజం జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు ప్రశాంత్, అరవింద్, ఆదిత్య, అభిరాం, సిద్దార్థ, రాజు, మణిరత్నం, రాజ్‌కుమార్, శివ ఉన్నారు.

డిమాండ్లు అంగీకరిస్తేనే .. సహకరిస్తాం

- రాజాపూర్ గ్రామస్తుల ధర్నా
- బ్లాస్టింగ్‌లతో భరించలేకపోతున్నామని ఆవేదన



ధర్నా చేస్తున్న రాజాపూర్ గ్రామస్తులు

రామగిరి: 'మా గ్రామాన్ని పూర్తిగా తీసుకుంటేనే సింగరేణి ఓసీపీకి సహకరిస్తామని, మా ప్రధాన డిమాండ్లు అంగీకరిస్తేనే మా భూములు ఇస్తాం' అని రాజాపూర్ గ్రామస్తులు తెల్చిచెప్పారు. పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారిపై గ్రామస్తులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బ్లాస్టింగ్‌ల కారణంగా ఇళ్లపై పెద్ద పెద్ద రాళ్లు పడుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నా సింగరేణి అధికారులు పట్టించుకోవడం వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజాపూర్ గ్రామం సేఫ్ జోన్‌లో ఉంటే బ్లాస్టింగ్ జరిగే సమయంలో సింగరేణి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది గ్రామంలో ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. రాజాపూర్ గ్రామం మొత్తం తీసుకోవాలని, మిగిలిన అరకొర భూమిలో నివాసం ఉండలేమన్నారు. నిర్వాసిత గ్రామంగా ప్రకటించి కలెక్టర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించండి



ఉన్న కొద్దిపాటి పొలం తీసుకున్నాక మాకు ఉపాధి ఎలా? మొదట ఊరు తీసుకుని తర్వాత మా పొలాలు తీసుకోవాలి. ఓసీపీ బ్లాస్టింగ్‌లతో ఇప్పటికే భయభ్రాంతులకు గురవుతున్నాం. ఇప్పుడు సింగరేణికి ఉన్న భూములు కూడా ఇచ్చి మేం ఇక్కడే ఉండి అనారోగ్యాల బారిన పడలేం. గతంలో కోల్పోయిన వాటికి పరిహారం చెల్లించాలి. పునరావాసం కల్పించి, మా పిల్లలకు శాశ్వత ఉపాధి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి.

– పాశం ఓదెలు, మాజీ సర్పంచ్, రాజాపూర్

గ్రామస్తులు సహకరించాలి



ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 మనుగడ కొనసాగాలంటే భూసే కరణ తప్పనిసరి. ఓసీపీ–2 విస్తరణకు రాజాపూర్ గ్రామస్తులు సహకరించాలి. గని భవిష్యత్ దృష్ట్యా సుమారు 88 ఎకరాల భూసేకరణకు గ్రామస్తులు సహకరించాలి. గ్రామస్తుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భూనిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం. ఇళ్ల సేకరణకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– ఎస్.సుధాకర్‌రావు, ఆర్జీ–3 జీఎం

నూకాంబిక పోచమ్మ వేడుకలు ప్రారంభం



మండప ప్రాంగణంలో హోమక్రతువు

రామగుండం: టీటీఎస్ అంతర్గాం బర్మా, శ్రీలంక, కాందీశీకుల కుటుంబాల ఆరాధ్య దైవమైన నూకాంబిక పోచమ్మతల్లి దీక్షా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మతల్లి మాలధారణ స్వీకరించిన స్వాముల సమక్షంలో మండప ప్రాంగణంలో హోమక్రతువు, కుంకుమపూజలు నిర్వహించారు. వేడుకలకు అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్‌పటేల్ హాజరయ్యారు. 2న పోచమ్మతల్లి ఆలయంలో చివరి దశ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు తెలిపారు.

యూత్ పార్లమెంట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థులతో అధ్యాపకులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల రెండురోజుల పాటు నిర్వహించిన నోడల్ డిస్ట్రిక్ట్ రౌండ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో 10మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి రౌండ్‌కి ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ చైర్‌పర్సన్ జైకిషన్ ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో పెద్దపల్లి నుంచి దిశా సర్దా, మంచిర్యాల నుంచి మిస్బా సలాహుద్దీన్ మహమ్మద్, బైన్ మౌనిక, సుల్తానాబాద్ నుంచి కొక్కొండ వైష్ణవి, గోదావరిఖని నుంచి ఆట శాంతిప్రియ, షేక్ సనా సుహానా, సుల్వ లీలా రాణి, షేక్ బాబా, ఉభయ్‌రెడ్డి, లక్షెట్టిపేట నుంచి వడై విజయ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన వారు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర క్రీడలు సర్వీసుల అధికారికి, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేస్తారని తెలిపారు.

మేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లింగారెడ్డి



లింగారెడ్డి

ధర్మారం: మండలంలోని నందిమేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గడ్డం లింగారెడ్డి విజయం సాధించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈదుల ప్రదీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లేశ్వరి గెలుపొందారు. జాయింట్ సెక్రటరీగా పురాణం సందీప్‌కుమార్, ట్రెజరర్‌గా ఆకారి రాజేశం, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ సెక్రటరీగా భీమారపు సంపత్, సీనియర్ ఈసీ సభ్యులుగా నార అశోక్‌రెడ్డి, బొట్ల లక్ష్మీనర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అశోక్‌రెడ్డి ప్రకటించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్



అభినందిస్తున్న న్యాయవాదులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లకిడి భాస్కర్ ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఎన్నికై హ్యాట్రిక్ విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా అజయ్‌క్రాంతిసింగ్, ప్రధాన కార్యదర్శిగా కోటగిరి వాసు, జాయింట్ సెక్రటరీగా అశోక్, కోశాధికారిగా సత్యనారాయణ, క్రీడా, సాంస్కృతిక ప్రతినిధిగా నవీన్, గ్రంథాలయ ప్రతినిధిగా రవి, మహిళా ప్రతినిధిగా శిరీషరాణి ఎన్నికయ్యారు.

మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు



హరిబాబు

మంథని: మంథని బార్ అసోసియేషన్‌కు గురువారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడిగా కేతిరెడ్డి రఘోత్తం రెడ్డి, జాయింట్ సెక్రటరీగా విజయ్‌కుమార్, కోశాధికారిగా రాచర్ల రాజేందర్, లైబ్రరీ సెక్రటరీగా శ్రీనివాస్, స్పోర్ట్స్, కల్చరర్ సెక్రటరీగా ఆర్ల నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సంతోష్, షబానా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాపయ్య పేర్కొన్నారు.

రాజీవ్‌యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: రాజీవ్‌యువ వికాసం పథకం కింద బీసీ నిరుద్యోగ యువత వచ్చేనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందన్నారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, స్టడీ సర్టిఫికెట్, మొబైల్ నంబర్, రవాణారంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదార్ పాసు పుస్తకం, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సమర్పించాలని వివరించారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

రామగిరి: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని రేండ్ల శారద అన్నారు. మండలంలోని కల్వచర్లలో ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు న్యాక్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షలు నిర్వహించారు. ప్రతీ మహిళ ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండాలని, స్వయం ఉపాధి మార్గాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం ద్వారా సుమారు 300 మందికి ఉచిత శిక్షణ అందించి న్యాక్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి సొంత ఖర్చులతో సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతీ మహిళకు తమ సొంత ఖర్చులతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.20లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

• పాస్టర్ మృతిపై సంతాపం

మంథని: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై మంథని నియోజకవర్గ పాస్టర్లు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఎంసీపీఎఫ్ అధ్యక్షుడు ఐతూ డేవిడ్, ఉపాధ్యక్షుడు కృపాకర్, జనరల్ సెక్రటరీ కస్నూరి అశోక్, జాయింట్ సెక్రటరీ జోషి, కోశాధికారి జయరాజ్, సుదర్శన్, నవీన్, జోసఫ్, ఫిలోమోనూ, ఈర్ల థామస్, ఎలీషా ఉన్నారు.

• అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇదులాపూర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ యాలాల సురేశ్(35)అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఈసందర్భంగా దహనసంస్కారాలకు ఎంపీవో కిరణ్ ప్రభుత్వం నుంచి రూ.10వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య స్రవంతి, ముగ్గురు సంతానం ఉన్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచు దొంతరవేన రజిత, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు పరామర్శించారు.

• చికిత్స పొందుతూ యువకుడి మృతి

మంథని: మండలంలోని విలోచవరం గోదావరి తీరంలో 24న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గ్రామానికి చెందిన మీసాల రాకేశ్ (32) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• ముత్తారానికి చెందిన యువకుడు..

ముత్తారం: ముత్తారానికి చెందిన రొయ్యల రాజ్‌కుమార్ (25) అనే యువకుడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజ్‌కుమార్ ఓ దినపత్రికలో పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఈనెల 17న గడ్డిమందు తాగాడు. మొదట పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

• గీతకార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాళ్లపల్లి శంకర్‌గౌడ్ గురువారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయపడ్డాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పేద కుటుంబానికి చెందిన శంకర్‌గౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచులు సదానందం, మంగ, మల్లయ్య కోరారు.

• విద్యుత్ సరఫరాలో అంతరాయంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రామగుండం: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల మధ్య ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. స్థానిక విద్యుత్‌నగర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో విద్యుత్ అంతరాయం జరగనుందని విద్యుత్‌శాఖ అధికారులు ముందుగానే ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌లో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రత్యామ్నాయంగా జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రజలు కార్యాలయ ప్రాంగణంలో నిరీక్షించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయంగా జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

• మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలి

సుల్తానాబాద్: పట్టణంలోని స్వప్నకాలనీలో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్‌ను కలిసి కాలనీవాసులు గురువారం వినతిపత్రం అందించారు. మున్సిపల్ పరిధిలోని స్వప్నకాలనీలో పలుచోట్ల మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టి నీరునిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

• ఆర్థికసాయం అందజేత

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలలో నిరుపేద పద్మశాలీ కుటుంబానికి చెందిన వెంగళ రమకు రూ.32వేల నగదును లయన్స్ క్లబ్ ప్రతినిధులు గురువారం అందజేశారు. రమ తండ్రి మరణించడంతో స్పందించిన అప్పటి పద్మశాలి సంఘం అధ్యక్షుడు వలస నీలయ్య సొంత డబ్బుతో అమ్మాయి పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ. 13వేలు 2013లో ఇద్దరి పేరుపై బ్యాంకులో ఖాతా తెరిచారు. గురువారం మెచ్యూరిటీ గడువు ముగియడంతో బ్యాంకు నుంచి వచ్చిన రూ.32వేలు క్లబ్ సభ్యుల సమక్షంలో రమకు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, కార్యదర్శి పిట్టల వెంకటేశం, సభ్యులు సతీశ్, అనిల్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, వెంకటేశ్వర్లు, పల్ల శరత్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమం పట్టని సర్కారు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డితో కలిసి సమావేశంలో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేశామంటూ సీఎం అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు రాంసింగ్, సదానందం, శ్రీనివాసరావు, సమ్మయ్య, ప్రదీప్‌కుమార్, అశోక్‌రావు, చక్రధర్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సతీష్, రమేశ్, కృష్ణ, ఫహీం, శ్రీనివాస్, నర్సింగం, స్వతంత్రకుమార్, రమేశ్ ఉన్నారు.

ఆదర్శలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ వేడుకలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆదర్శ విద్యాలయంలో గురువారం ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ వేడుకలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పంబాల సదానందం యాదవ్ తెలిపారు. ఈ మేరకు ప్రతీరోజు జరిగే పాఠశాల అసెంబ్లీ (ప్రేయర్)లో హరియాణాకు సంబంధించి ఏదో ఒక అంశం పరిచయం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మారుపేర్ల విజిలెన్స్ కేసులు పరిష్కరించాలి



మహాసభలకు వెళ్తున్న సీఐటీయూ నాయకులు

గోదావరిఖని: ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల విజిలెన్స్ కేసులు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శ్రామికభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారంలో సింగరేణిలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సుదీర్ఘకాలం తర్వాత గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో స్ట్రక్చర్ సమావేశాలు జరిగినప్పటికీ ఇప్పటివరకు ఏఒక్క సమస్య పరిష్కారం కాలేదని, మరికొన్ని సమస్యలు పరిష్కారం కోసం కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సింగరేణి యజమాన్యం ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులు, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కోల్‌వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ 11వ మహాసభలు జార్ఖండ్‌లోని రాంచీలో 28 నుంచి 30వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మేదరి సారయ్య, ఆరెపల్లి రాజమౌళి, తోట నరహరిరావు, ఎస్‌కేగౌస్, వంగళ శివరాంరెడ్డి పాల్గొన్నారు.

మహాసభలకు బయలుదేరి వెళ్లిన నాయకులు

ఆల్‌ఇండియా కోల్‌వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ 11వ మహాసభలకు సింగరేణి కార్మిక నాయకులు గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సభల్లో కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మందనరసింహారావు తెలిపారు. పలు ఏరియాల బ్రాంచీల నుంచి 30 మంది రామగుండం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి వెళ్లారు.

మట్టి అక్రమ సరఫరా ఆపలేరా?

పెద్దపల్లిరూరల్: అక్రమంగా సాగిస్తున్న మట్టిదందాను అధికార యంత్రాంగం ఎందుకు ఆపడం లేదని, సంబంధిత అధికారులు సీజ్ చేసి పెద్దపల్లి మండలం కొత్తపల్లి శివారులో నిల్వ ఉంచిన మట్టిని కొద్దిరోజులుగా కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారని తెలిసినా చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యమేంటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన పెద్దపల్లిలో మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన ఆరు ఇటుక బట్టీల యజమానులు అనుమతి పొందిన దానికన్నా అదనంగా మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నారంటూ గతంలో తాను చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన అధికారులు 95,294 మెట్రిక్ టన్నుల మట్టిని సీజ్ చేసి దాదాపు రూ.2కోట్లకు పైగా పెనాల్టీ విధించారని పేర్కొన్నారు. కానీ సదరు బట్టీ యజమానులు, కొందరు అధికార పార్టీ నాయకులు కలిసి జరిమానా చెల్లించకుండానే మట్టిని రాత్రి సమయాల్లో దొంగల్లా తరలించుకుపోతున్నారని వివరించారు. కొత్తపల్లి గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది మట్టి టిప్పర్లను అడ్డుకుంటే ఆర్ఐ ఫోన్ చేసి వదలిపెట్టాలని ఆదేశించాడంటూ అందుకు సంబంధించి రికార్డు చేసిన ఆడియోను వినిపించారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు సీజ్ చేసిన మట్టికి విధించిన జరిమానా వసూలు చేసేదాకా మట్టి తరలింపు ఆపాలని, లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి ప్రభుత్వ ఖజానాకు గండిపడకుండా పోరాటం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న స్నేహితులు

పెద్దపల్లిరూరల్: చిన్ననాటి స్నేహితుడు అనారోగ్యం పాలై అకాల మరణం పొందడంతో స్నేహితులంతా ఒక్కటై తమ వంతుగా తలా కొంత పోగేసి రూ.లక్ష జమ చేసి కుటుంబానికి అండగా నిలిచారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ముత్యాల కనకయ్య కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో అతడితో పదో తరగతి వరకు చదివిన టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ స్నేహితులతో చర్చించి రూ.లక్ష పోగేసి గురువారం ఆర్థికసాయం అందించారు. అలాగే 7వతరగతి పూర్తిచేసిన కనకయ్య కుమారుడికి నోబెల్ స్కూల్‌లో ఉచితంగా టెన్త్ వరకు విద్య అందించేందుకు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎర్రోజు మోహన్ ముందుకొచ్చారు. శ్రీధర్, శ్రీకాంత్, రాజేందర్‌సింగ్, దయాకర్, సంతోష్‌రావు, మనోహర్, సురేశ్, మహేందర్, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతి, రెవెన్యూ అధికారులు

పాలకుర్తి: మండల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మండలంలోని కన్నాల రెవెన్యూ శివారులో గల బోడగుట్ట క్రషర్స్, డాంబర్ ప్లాంట్, ధర్మారం క్రాస్‌రోడ్డు, జీడీ నగర్ తదితర ప్రాంతాలలో గల ప్రభుత్వభూములను గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కొంతమంది ప్రభుత్వం నుంచి పొందిన అసైన్డ్ భూములను ఇతరులకు లీజుకు ఇచ్చినట్లు గుర్తించారు. అదేవిధంగా సర్వేనెంబర్ 493, 494లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు సైన్‌బోర్డులతో పాటు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు.

రెండోరోజుకు చేరిన న్యాయవాదుల నిరాహార దీక్ష

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్‌లో ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని హత్య చేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం రెండోరోజుకు చేరాయి. న్యూఇండియా పార్టీ వ్యవస్థాపకుడు జేవీ రాజు, సీపీఎం నాయకులు వై.యాకయ్య సందర్శించి సంఘీభావం తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సభ్యులు గోసిక ప్రకాశ్, చెలికల పద్మజ, గుజ్జేటి సత్యనారాయణ, పులిపాక ప్రవీణ్‌కుమార్, ఇరుగురాల మహేందర్, సంతోష్, డి.లింగస్వామి, ఎండీ ఉమర్, జూపాక వెంకట్, మేద చక్రపాణి, ఎస్.సంజయ్‌కుమార్, పంగ శంకర్, చందాల శైలజ, మురళీధర్, బోడ సమ్మయ్య, సురేశ్, ఎంచర్ల మహేశ్ పాల్గొన్నారు.

లింగాపూర్‌ను పంచాయతీగానే కొనసాగించాలి

రామగుండం: రామగుండం కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు విస్తరించడంలో భాగంగా సమీపంలోని గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో లింగాపూర్ గ్రామంపై వస్తున్న విలీన కథనాలపై ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. గురువారం లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు సమావేశమై ప్రభుత్వం విలీన ప్రతిపాదనలు విరమించుకోవాలని, లింగాపూర్‌ను గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని తీర్మానం చేసి ప్రతులను కార్యదర్శికి అందజేశారు. త్వరలోనే రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను కలిసి విలీనంతో జరిగే నష్టాన్ని వివరించి విలీన ప్రతిపాదనలు విరమించుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రతినిధులు నిమ్మరాజుల సాగర్, అర్శనపల్లి శ్రీనివాస్, కందుల సత్తయ్య, అర్శనపల్లి రాజు, కాంగ్రెస్ నాయకులు నాగినేని జగన్‌మోహన్‌రావు, శ్రీనివాస్, బీజేపీ నాయకులు తిరుపతి ఉన్నారు.

లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలి

రామగుండం: విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలని రామగుండం ఎస్సై గుండేటి సంధ్యారాణి అన్నారు. అబాది రామగుండంలోని హైస్కూల్ విద్యార్థులకు గురువారం పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఏకాగ్రతతో వ్యవహరించాలని, ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. హెచ్ఎం చంద్రయ్య, రాంపెల్లి శ్రీనివాస్‌శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.